రంజని - రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక కథానికల పోటీలో
నాలుగో బహుమతి పొందిన కథ

# మనిషి దేవోభవ !

మిత్రుడు రవి నన్ను బలవంతంగా గుడికి లాక్కెళ్ళాడు.

దేవుడి దర్శనం చేసుకుని ప్రసాదం తింటూ మెట్లు దిగుతోంటే అకస్మాత్తుగా "అరె నారాయణానంద స్వామీజీ రా" అని అరిచాడు రవి.

అతడి ఎక్సైట్‌మెంటుకి అబ్బురపడుతూ మెట్ల పక్కనున్న ఓపెన్ మండపం వైపు చూశాను.

చిన్న సైజు స్వామీజీలా ఉన్న ఒకాయన ఎత్తైన దిమ్మ మీద కూర్చుని ఓ పాతిక మందికేదో బోధిస్తున్నాడు.

"కలిసివద్దాం రా" అన్నాడు రవి అటుకేసి దారి తీస్తూ.

"వీళ్ళంతా హైటెక్కు స్వామీజీలు. చందా ఇస్తేనే మన వంక చూస్తారు" నవ్వుతూ చురకవేశాను.

"రా చెబుతా"

అయిష్టంగానే అనుసరించాను.

నారాయణానంద దగ్గరికెళ్ళి పాదాలనంటి నమస్కరించాడు.

రవిని ఆశీర్వదించారు. అతడు పొంగిపోయాడు. నేను మాత్రం నిర్లక్ష్యంగా చూస్తూ ఎడంగా నిలబడ్డాను.

"దూరంగా నిలబడ్డావేం నాయనా. నేను నీ తోటి మనిషినే"

స్వామీజీ చిన్న పిల్లాడితో మాట్లాడినట్టు ఎంతో లాలనగా అన్నారు. తబ్బిబ్బు పడ్డాను. సిగ్గుపడ్తూ దగ్గరికెళ్ళి నమస్కరించాను.

"నువ్వెవరివి నాయనా?" నా మొఖంలోకి సూటిగా చూస్తూ ప్రశ్నించారు.

"సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ని" కించిత్తు గర్వంగానే చెప్పాను.

సన్నని చిరునవ్వు ఆయన పెదాల మీద సుతారంగా కదిలింది.

"నీ గమ్యం ఏమిటి నాయనా ?"

"ఏమిటంటే......చాలా చాలా వున్నాయి"

"అహ. అలాగా! అయిదేళ్ళ తర్వాత నువ్వేం అవ్వాలనుకుంటున్నావో చెబుతావా నాయనా ?"

"టీమ్ లీడ్"

"బావుంది. పదేళ్ళ తర్వాత?"

"ప్రాజెక్ట్ మేనేజర్"

"చాలా బావుంది. మరి పాతికేళ్ళ తర్వాత?"

"ఓ కంపెనీ సీఈవో లేక వైస్ ప్రెసిడెంట్"

'అలాగా' అన్నట్టు తలాడించి మళ్ళీ నవ్వేరు. తప్పు దారిన పోతున్న పిల్లాడి వంక తల్లి చూసినట్టు చూశారు. నాకేం అర్థం కాలేదు. కంగారు పడుతూ అయోమయంగా చూశాను.

"ముప్ఫై ఏళ్ళ తర్వాత ఎలాటి జీవితాన్ని ఆశిస్తున్నావు నాయనా ?"

"అప్పటికి నాకు అరవై నిండుతాయి. ఓ పెద్ద రాజభవనం కట్టుకుని హ్యాపీగా ఉండాలని........"

కలవరపడుతూ అన్నారు "ఇప్పుడు హ్యాపీగా లేవా నాయనా ?"

ఉలిక్కిపడ్డాను. తడబడ్డాను. "అహ అది కాదు....మరేవిటంటే......ఇంకా ఎక్కువ హ్యాపీగా........."

"పెద్ద భవనం, ఖరీదైన సామాగ్రి, కార్లు, నౌకర్లు, చాకర్లు....వగైరాలన్నీ సమకూరితేనే ఎక్కువ హ్యాపీగా ఉంటానంటావ్. అదీ ముసలి వయస్సులో ?!"

జవాబేం ఇవ్వాలో తోచలేదు. నీళ్ళు నమిలాను.

"టీమ్ లీడ్ అయినా ప్రాజెక్టు మేనేజర్ అయినా ఆఖరికి కంపెనీ అధిపతి అయినా ఏమంత ఆనందం కలగదన్నమాట. మరప్పుడు ఆ మార్గంలోనే ఎందుకు వెళ్ళాలి? ఆ లక్ష్యమే ఎందుకు ఏర్పరచుకోవాలి? మార్చుకోవచ్చు కదా నాయనా. అది నీ చేతుల్లోని పనే కదా!"

ఏం చెప్పాలో తోచలేదు. నిజానికి మెదడు బ్లాంక్ అయింది. ఆయన వంకే శూన్యదృక్కులు చూస్తుండిపోయాను.

"ప్రశ్నించుకో. నిన్ను నువ్వు ప్రశ్నించుకో. జిజ్ఞాస మొదలయ్యేది అక్కడే. పూజించడం ధ్యానించడం కన్నా ప్రశ్నించడం వల్లనే ఎక్కువ తెలుసుకోగలుగుతాం. ప్రశ్నించటమూ ఓ జ్ఞానమార్గమే. ప్రయత్నించు నాయనా "

బుద్ధిగా తలాడించి బయటికి వచ్చేశాను. నా వెనుకే రవీ వచ్చాడు.

మౌనంగా బైక్ స్టార్ట్ చేసి ముందుకు దూకిస్తోంటే, "టేక్ కేర్" అని వెనుక నుంచి అరిచాడు రవి.

నేను కోరుకుంటున్న దాంట్లో తప్పు, అసహజం ఏమీ లేవు. ఏ వృత్తిలో వున్న వాడైనా సరే అందులో ఉన్నత స్థానానికి ఎగబాకాలనే ఆశిస్తాడు. మరి స్వామీజీ ఎందుకలా మాట్లాడారు? ఆయనేదో అన్నారే అనుకో తనెందుకేదో ఘోర తప్పిదం చేసిన వాడిలా ఫీలై పోతున్నాడు?

నాణేనికి ఒక వైపే చూస్తున్నానా? రెండో వైపున ఏముందసలు?

ఇంటికెళ్ళాను. అన్యమనస్కంగా స్నానం చేశాను.

"భోంచేద్దువుగాని రారా నానీ..." అమ్మ పిలిచింది.

మౌనంగా వెళ్ళి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్నాను.

గుత్తి వంకాయ కూర వడ్డిస్తూ, "నవనవలాడుతున్న తెల్ల వంకాయలు - చిన్నవి కన్పిస్తే నీకిష్టమని కొన్నాను. చిన్నప్పుడు గుత్తివంకాయని ఎత్తి పట్టుకుని ఒక్కో ముక్కా కొరుకుతూ ఎంత సంబరపడిపోయేవాడివో గుర్తుందా!" అడిగింది.

నేను బదులివ్వలేదు. కూర కలుపుకొంటోంటే నెయ్యి వడ్డించి, "దేని గురించిరా అంతలా ఆలోచిస్తున్నావు? ఆఫీసు విషయాలా?" అడిగింది మళ్ళీ.

స్వామీజీ మాటలు నా మన:సరస్సులో రాళ్ళల్లా పడి చిలికి కెలికి కుదిపేస్తున్నాయని చెప్పలేక తలాడించాను.

"హుఁ సరిపోయింది! నేనో మాట చెప్పనా నానీ? ఆఫీసు విషయాలు ఆఫీసు గడప దాటగానే మరచిపోవాలి. అది బతుకు తెరువు. ఇంటికొచ్చేక ఇంటి విషయాలే పట్టించుకోవాలి. ఇది బతుకు. తెల్సిందా?"

"ఇంటి గొడవలు చూసుకోడానికి నువ్వూ డాడీ ఉన్నారుగా మమ్మీ"

"మేం ఇవాళుంటాం రేపుంటాం. ఎల్లకాలం ఉండం కదా. నీ ఇల్లు నువ్వు ఏర్పరచుకోవాలి నీ కుటుంబాన్ని నువ్వు చక్కబెట్టుకోవాలి"

"ఈ డొంక తిరుగుడంతా నా పెళ్ళి గురించే కదా మమ్మీ!" నవ్వేను.

"నేనేదో కాని మాట అన్నట్టు నవ్వుతావేంట్రా. పెళ్లి పిల్లలు బరువులు బాధ్యతలు బంధువులు మిత్రులు ఇరుగుపొరుగు - ఇవన్నీ ప్రతివారికీ కావాల్సిందేరా. వాటి మీద దృష్టి పెట్టకపోతే ఎలా చెప్పు?"

"గేటెడ్ కమ్యూనిటీలో త్రీ బీహెచ్‌కె కొన్నాక ఆలోచిద్దాంలే......"

"ఏ వయస్సుకా ముచ్చటన్నారు. వచ్చే శ్రావణానికి ఇరవై ఎనిమిదెళ్ళి ఇరవై తొమ్మిదొస్తాయి. ఇంకెప్పుడు చేసుకుంటావురా పెళ్ళి !"

"మమ్మీ! కాలం చాలా మారిపోయింది. పాతకాలపు ఆలోచనలొద్దు మమ్మీ. పెళ్ళే గమ్యం కాదు....."

"ఏంటీ?!" బుగ్గలు నొక్కుకుంది.

"ఇందులో అంత ఆశ్చర్యపడాల్సిందేముంది మమ్మీ. మ్యారేజ్ ఒక నేచురల్ ఫెనోమిన. ఒక వయస్సు వచ్చాక పశుపక్షులన్నిట్లో ఏదో రూపంలో జరిగేదే. దాని గురించెక్కువ ఆలోచించడం ఎక్కువ ఇంపార్టెన్స్ ఇవ్వడం అనవసరం...."

"అహా. అలాగా! నీ ఇంజినీరింగు చదువు నేర్పింది ఇదేనా!"

"మమ్మీ! ఇలాటివి స్కూళ్ళలో కాలేజీల్లో నేర్పరు....."

"నాకు తెలవకడుగుతాను మరేం నేర్పుతార్రా?"

"నాలెడ్జ్, స్కిల్, మ్యానేజ్‌మెంట్, ప్లానింగ్, ఫైనాన్సియల్ మ్యాటర్స్ లాంటివి చెబుతారు"

"అవన్నీ ఎందుకురా?"

"వాటివల్లే కదా నెలకి యాభైవేలు సంపాదిస్తున్నానూ !"

"డబ్బు సంపాదించడానికి మాత్రమేనా ఈ చదువులూ సంధ్యలూ!"

"మరింకెందుకనుకుంటున్నావ్ మమ్మీ ?"

"ఎందుకనుకుంటేనేంలే నేను చదువుకోకపోవటం మంచిదయిందన్పిస్తోంది!"

"తల్లీ కొడుకులు వాదనలేసుకున్నార్చున్నారేంటి సంగతి? మళ్ళీ ఏదైనా పెళ్ళి సంబంధం వచ్చిందా!" వస్తూ అన్నారు నాన్న.

"టైముకొచ్చారు. మమ్మీ కుంకుడు రసంతో నా తల అంటేస్తోంది డాడీ" ఫిర్యాదు చేశాను.

"మమ్మీ చాదస్తానికేం గాని మీ ప్రాజెక్టు రిలీజెప్పుడూ?"

"నెక్స్ వీక్......"

"చక్కని రికగ్నేషన్ తెచ్చుకున్నావంటే ఇక నీకు తిరుగుండదు. ఆన్‌సైట్‌కేం పంపించరా నానీ?"

"ప్రస్తుతం ఫైవ్ ఇయర్స్ ఎక్స్‌పీరియన్స్ ఉన్నవాళ్ళనే పంపిస్తున్నారు...."

"ఏడిశారు. వర్త్ చూడకుండా ఎక్స్‌పీరియన్స్‌కి వాల్యూ ఇవ్వడం ఏవిటి? ఇంకే కంపెనీ అయినా బెటర్ ఆఫర్ ఇస్తుందేమో ట్రై చెయ్యి....."

"దొందుకు దొందే అని తండ్రీ కొడుకులు ఒకరికొకరు బాగా సరిపోయారు. ఉద్యోగాలూ ప్రమోషన్లూ సంపాదనలూ తప్ప మీకింకేం పట్టవా? ఎవరూ అక్కర్లేనట్టు ఎవర్తో పనిలేనట్టు ఒంటిస్తంభం మేడలో ఉంటానంటారేమిటి ఖర్మ !"

కించిత్తు కోపంగా ఉక్రోషంగా విసుగ్గా ప్రశ్నించింది అమ్మ.

నాకు తెలీకుండానే ఉలిక్కిపడ్డాను.

స్వామీజీ అన్నట్టుగానే మమ్మీ ప్రశ్నిస్తోంది!

"మొఖం అలా పాలిపోయిందేవిట్రా" కుర్చీ లాక్కుని కూర్చుంటూ అడిగారు నాన్న.

"ఈవెనింగ్ రవి ఎవరో స్వామీజీ దగ్గరకి లాక్కెళ్ళాడు. ఆయన మాటలు గుర్తొచ్చాయి......."

"ఏమన్నార్రా?" ఆత్రంగా అడిగింది మమ్మీ.

"ఏవో మెట్ట వేదాంతపు కబుర్లు చెప్పుంటారు!" నాన్న నవ్వేరు.

"మీరుండండి. అన్నీ మీకే తెలుసంటారు. మీకు తెలీనివి వుండొచ్చేమో విన్నాక ఆలోచించి చూద్దాం అనుకోరు గదా!....స్వామీజీ ఏమన్నారో నువ్వు చెప్పరా నానీ"

మరి చెప్పక తప్పలేదు. అంతా చెప్పేశాక చిత్రంగా నా మనస్సెంతో తేలికైన భావన కలిగింది. హాయిగా నిట్టూర్చాను.

"అన్నీ వదిలేసుకున్న ఆ సన్యాసికి లోకపు సంగతులెందుకో!" నాన్న వ్యాఖ్యానించారు.

"వైరాగ్యమంటే అన్నీ వదిలెయ్యడం కాదు అనవసరమైనవి వదిలెయ్యడమే"

అమ్మ మాటలకు తుళ్ళిపడి నాన్నా నేనూ ఒకేసారి అమ్మ మొఖంలోకి చూశాం.

"ఆయన చెప్పినట్టు నిన్ను నువ్వు ప్రశ్నించుకున్నావా నానీ?"

నాకు పొలమారింది. అమ్మ నా నెత్తిమీద చిన్నగా చరుస్తూ 'చిరంజీవ చిరంజీవ' అంటోంటే మంచినీళ్ళు త్రాగాను.

"ఆయనెవడో ఘటికుడే. నీతో నీళ్ళు తాగిపిస్తున్నాడు" అని నవ్వి అన్నారు నాన్న. "ఉద్యోగం సంపాదన గుర్తింపు ప్రమోషన్ చకచకా నిచ్చెన మెట్లెక్కి టాప్ పొజిషన్‌కెళ్ళి పోవడం, సక్సెస్ సాధించడం, బోల్డంత సంపాదించడం - ఎవరికైనా లైఫ్‌లో ఇదే లక్ష్యం!"

"వీడూ మీలాగే ఆలోచిస్తున్నాడు. ఎంత సంపాదిస్తే అంత గొప్ప అంటున్నాడు"

"కరక్టే కదా !"

మమ్మీ బుగ్గలు నొక్కుకుని ఆశ్చర్యంగా ఆందోళనగా నాన్ననీ నన్నూ మార్చి మార్చి చూసింది.

"మేమేదో వింత జంతువులమైనట్టు చూస్తున్నావేంటోయ్" బిగ్గరగా నవ్వేరు నాన్న.

"మీ తలలపైన రూపాయల కొమ్ములు కన్పిస్తున్నాయి"

"వ్వాట్!" అదిరిపడ్డాను.

"రూపాయల్ని ఏం చేసుకుంటారు ? తింటారా?"

"పిచ్చి ప్రశ్న మామ్" అన్నాను అసలదీ ఓ ప్రశ్నేనా అన్నట్టు చూస్తూ.

"నిధికన్నా రాముని సన్నిధి సుఖమన్నాడు రామదాసు"

"అది జైలు వైరాగ్యం!" నాన్న నవ్వేరు.

"మీలాగే డబ్బూ హోదా అధికారాలే ముఖ్యమనుకుని ప్రతిదానికీ తందాన తాన అన్న అయ్యేయస్‌లూ మంత్రులూ పారిశ్రామిక వేత్తలూ ఇప్పుడు జైల్లో చిప్పకూడు తింటూ సంబరంగా ఉన్నారంటారు!"

మిర్రి చూశాం. అబ్బురంగానూ చూశాం. ఆ పిమ్మట గుటకలు మ్రింగాం.

"మామ్ పాలిటిక్స్‌లో చేరుతుందేమో" అంటూ నవ్వేను. భోజనం ముగించి లేచాను.

అమ్మ నిరుత్సాహంగా నిస్సహాయంగా నా వంక చూస్తూ నిట్టూర్చింది.

"త్వరగా మైక్రోసాఫ్ట్ సర్టిఫికేషన్‌కి ట్రై చెయ్యి. శంఖంలో పోస్తేనే తీర్థం అవుతుంది" నాన్న అన్నారు.

"నెక్ట్స్ మంత్ స్లాట్ బుక్ చేశాను. డిస్టెన్స్‌లో ఎంబిఏ చేస్తే ఎలా ఉంటుంది డాడ్"

"గ్రేట్ ఐడియా! మేనేజ్‌మెంట్ లెవెల్‌కి దూసుకెళ్ళాలంటే ఎంబిఏ చేసి తీరాలి. ఎన్నాళ్లు ఒకరికింద వంగి పనిచేస్తావు చెప్పు? అదే మేనేజ్‌మెంట్లోకెళితే నువ్వే కమాండ్ చేయొచ్చు"

"ఎప్పుడూ అదే సంతా! కాస్త నా మాట వినరా నానీ. నీ నెత్తిన నాలుగక్షింతలు వేసేస్తే మా బాధ్యత తీరుతుంది. మేం నిశ్చింతగా కన్నుమూస్తాంరా"

"పెళ్ళి ఒత్తిడి నా గురించా మావయ్య గురించా?" నవ్వుతూనే చురక అంటించాను.

"మీ మావయ్య ఫోన్ చేసుంటాడు. అందుకే ఈ జడివాన !"

"అక్కడికి వీడు బాలా కుమారుడైనట్టు మాట్లాడతారేంటి? ఏ వయస్సు కాముచ్చటన్నారు"

"కెరీర్లో ఒక్క జంప్ రానీ మామ్ వెంటనే కీర్తి మెడలో తాళి కట్టేస్తా"

"నా మాట ఎలాగూ వినవు గాని కనీసం స్వామీజీ ఎందుకలా చెప్పారో ఆలోచించరా. నీ దృష్టీ దృక్కోణం మార్చుకోరా"

చటుక్కున నారాయణానంద ముఖం నా కళ్ల ముందు మెదిలింది. ఎంత ప్రశాంతంగా ఉన్నారు. పసి పిల్లల బోసినవ్వులా ఆయన నవ్వు ఎంత పవిత్రంగా ఆత్మీయంగా వుందీ!

నేనెప్పుడైనా ఒక్క రోజైనా-కనీసం ఒకే ఒక్క గంట అయినా అలా వున్నానా?

ఆత్రంగా గతాన్ని గబగబా తవ్వేను.

ఊహ తెలిసేప్పటికి ఎల్కేజీలో వున్నాను. ఇంగ్లీషు అక్షరాలు అంకెలు రైమ్సు....మెల్లగా పుస్తకాల బ్యాగ్ బరువు పెరిగింది......హైస్కూల్లో క్లాసు ఫస్టు రావాలని తపన. ఆ తర్వాత దాన్ని నిలుపుకోవాలని ఆరాటం. క్లాసు చదువుతో బాటు తెల్లారగట్లే లేచి ఐఐటీ ఫౌండేషన్ కోచింగ్ కోసం పరుగు.....585 మార్కుల్తో ఎస్ఎస్‌సి సర్టిఫికెట్ చేతబట్టి ఇంటర్లోకి ...... ఎమ్సెట్ ర్యాంక్ కోసం మళ్ళీ పరుగు. పట్టుదల.....నిద్రరాని రాత్రులు...... కలవాట్లు.......అభద్రత.....భయాలు....మొత్తానికి మూడంకెల ర్యాంక్...టాప్ ఇంజినీరింగ్ కాలేజీలో స్టూడెంటుగా.....నో రిలాక్స్ నో హాబీలు.... మళ్ళీ క్లాసులు ల్యాబ్‌లు ఇంటర్నల్స్ సెమిస్టర్స్....అదో ప్రపంచం....మూడో సంవత్సరంలో క్యాంపస్ సెలక్షన్ కోసం పోటీ....హమ్మయ్య. యమ్మెన్సీలో సెలక్షన్.....ఫ్రెండ్స్ పార్టీల గోల.....ప్రాజెక్టు వర్కు.... థాంక్ గాడ్! ఫైనల్ ఎగ్జామ్స్ ఖతం. డిస్టింక్షన్లో పాస్.....డ్రెస్ కోడ్ ధరించి వెళ్ళి కంపెనీలో చేరాను...ఇక పరుగు ఆపెయ్యొచ్చనుకున్నాను. రేస్‌లో పాల్గోనక్కర్లేదనుకున్నాను. కాని టార్గెట్లు తరమసాగాయి. ఒత్తిళ్లు, ఫారిన్ క్లయింట్స్‌ని శాటిస్‌ఫై చెయ్యడం, టైమ్లీ డెలివరీలు...క్షణం ఆగి ఆయాసం తీర్చుకోడాక్కూడా లేదు....పరుగు పరుగు.....!

నిట్టూర్చాను.

జీవితమంటే పరుగు పందెమేనా?

క్షిపణిలాంటి ప్రశ్న! జవాబెవరిస్తారు?

ఎవరివో అరుపులూ కేకలూ విన్పించాయి. వీధిలోకి దూసుకెళ్ళాను. నాన్న కూడా వచ్చేశారు. మేమే కాదు చుట్టు ప్రక్కల అన్ని ఇళ్ళల్లోంచి అందరూ బయటికొచ్చి భయంభయంగా ఎదురింటి వైపు చూడసాగారు.

"ప్చ్....ఈ అత్తాకోడళ్ళ గొడవకి అంతం వున్నట్టు లేదు" నాన్న అన్నారు సిగరెట్టు ముట్టిస్తూ.

"ఇంట్లో ఇద్దరు మగాళ్ళున్నారుగా, వాళ్లైనా సర్ది చెప్పొచ్చుగా డాడీ"

"ఏవో కట్నపు గొడవలు. ఇతరుల విషయాల్లో తలదూర్చడం మంచిది కాదు...."

తిరిగి ఇంట్లోకెళ్ళిపోబోతూ ఆగాం. అమ్మ ఎప్పుడెళ్ళిందో ఏమో ఆ ఇంటి కోడలి చేయి పట్టుకుని మా ఇంటికి తీసుకొస్తోంది. ఆ అమ్మాయి అత్త మావలు వాళ్ళ గుమ్మంలో నిలబడి రంకెలేస్తున్నారు. పెద్ద గొంతుతో శాపనార్థాలు పెడుతున్నారు.

"నీకసలు బుద్ధుందా? నేలకు పోయేది నెత్తికి రాసుకుంటావేంటి?" అమ్మ మీద కోప్పడ్డారు నాన్న.

అమ్మ నాన్న వంక ఒక పురుగులా చూసి తలతిప్పేసుకుంది.

ఆ అమ్మాయి చీర తడిసి ఉంది. కిరసనాయిలు వాసన గుప్పుమంది. అరుగు మీద కూలబడి బావురుమంటోంటే అమ్మ ఓదార్చసాగింది.

వాళ్ళెంత దుర్మార్గానికి తలపడ్డారో అర్థమైంది. గమ్మునుండి పోయాం.

అంతదాకా ప్రేక్షకుల్లా వున్న ఇరుగుపొరుగు అంతా మా ఇంటి ముందుకి గుంపుగా చేరారు.

"టైముకి భలే రక్షించారు" "పోలీసులకి ఫోన్ కొట్టండి" "అసలీ అమ్మాయి పుట్టింటి వాళ్ళకి ఇన్ఫార్మ్ చేద్దామని ఎప్పట్నుంచో అనుకుంటున్నాను" "నేను వెళ్ళి తలుపులు బద్దలు గొడదామనుకుంటున్నాను, ఈలోగా మీరెళ్లి తలుపులు బాది తీసుకొచ్చేశారు"– రకరకాల వ్యక్తీకరణలు!

ఆ అమ్మాయి అత్తింటి వారి మీద కారాలూ మిరియాలూ నూరుతూ పోలీసుకేసు పెడదామంటూ ఆవేశపడే వారి సంఖ్య అధికమయ్యింది.

ఇంతలో ఆ అమ్మాయి భర్తా మావగారూ వచ్చారు. తప్పైపోయిందని లెంపలేసుకున్నారు. అంతా వారి మీద ఒంటి కాలిమీద లేచారు. తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టారు. కొట్టబోయారు. అన్నీ భరించారు. చేతులు జోడించారు. ఇలాటి ఘటన పునరావృతం కానివ్వమని వేడుకున్నారు.

జనం మెత్తబడే సరికి వాళ్లు ఆ అమ్మాయి పాదాల మీద పడబోయారు. ఆమె కరిగిపోయింది. వారిని చూపుల్తోనే క్షమించేసింది.

"ఇంకెప్పుడూ ఇలాటి అకృత్యాలకు పాల్పడమని రాసివ్వండి" ఆజ్ఞాపిస్తున్నట్టుగా అంది అమ్మ.

"కాగితాలక్కర్లేదు కాపురం కావాలి" అంటూ ఆ అమ్మాయి భర్త వెంట వెళ్ళిపోయింది.

జనం చెదిరేక అమ్మతో అన్నారు నాన్న "బుద్ధొచ్చిందా? తగుదునమ్మా అంటూ వెళ్ళావు. ఇప్పుడేమయ్యింది? ఎడాపెడా నీ చెంపలు వాయించి మరీ వెళ్ళిపోయింది!"

సన్నగా నవ్వింది అమ్మ. "వాళ్ళా అమ్మాయిని వరకట్నాకలికి బలి చేయబోయిన సంగతి ఊరూ వాడా తెలిసింది. అలా తెలిసిందన్న సంగతి వాళ్ళకూ తెలిసింది. ఇక ఆ అమ్మాయి జోలికెళ్ళరు. శిక్షించడం కాదు మార్పు తీసుకురావడం ముఖ్యం!"

సూటిగా ధీమాగా చెప్పిన అమ్మవంక అపురూపంగా చూశాను. నాన్న మాత్రం ధుమధుమ లాడుతూండిపోయారు.

* * *

శనివారం కావడంతో నేను నిద్రలేచే సరికే తొమ్మిదిన్నరయ్యింది. కాఫీ త్రాగుతూ 'హిందూ' తిరగేస్తోంటే రవి ఫోన్ చేశాడు.

"జూబ్లీ బస్టాండ్ రోడ్‌లోని ఆంజనేయస్వామి టెంపుల్లో ప్రతి శనివారం అన్నదానం చేస్తూంటార్రా. ఈ వారం నేను స్పాన్సర్ చేస్తున్నాను. అందర్తో కలిసి భోంచేద్దాం రారా"

"అంత దూరం రాలేన్రా......" ఒళ్ళు విరుచుకుంటూ అన్నాను.

"వచ్చిన వాళ్ళందరికీ కాదనకుండా లేదనకుండా వడ్డిస్తారు. భోజనానికి వచ్చేదంతా నిరుపేదలే. ఆకలి తీరిన వారి కళ్ళల్లోని తృప్తి కృతజ్ఞత చూశావంటే నువ్వూ ఓ వారం స్పాన్సర్ చేస్తావు. లేదా ఇతరులకి చెప్పి చేయిస్తావు"

"సరే. ఒంటి గంటక్కదా. ట్రై చేస్తాన్లే....."

మెయిల్ చెక్ చేసుకుని ట్విట్టర్ కబుర్లు చదివి ఫేస్‌బుక్‌లో అప్‌డేట్ అయ్యేసరికి పన్నెండుదాటింది. ఆదరా బాదరా బైక్ తీసి బయటికి దూకించాను.

హైవే మీద వేగంగా దూసుకెళ్తున్నాను. వద్దు వద్దు అంటూ ఎవరో వెనుక నుంచి హెచ్చరిస్తున్నట్టుగా అన్పించింది. వేగం తగ్గించాలనే అనుకున్నాను. కానింతలోనే ఓ ట్రక్కు అదుపు తప్పి నా మీదకు దూసుకొచ్చింది....!

స్పృహలో కొచ్చీ రాగానే భయం భయంగా చుట్టూ చూశాను.

ఆసుపత్రి. తలకీ కాళ్ళకీ చేతులకీ కట్లు. ఎదురుగా కన్నీళ్ళతో అమ్మ! ఆందోళన పడుతూ నాన్న!

"పెద్ద గండం గడిచింది. ధైర్యంగా వుండు నాన్నా" అంది అమ్మ నా తల మీద చేయివేసి నిమురుతూ.

డాక్టరొచ్చారు. సమయానికి ఆసుపత్రికి తీసుకురావడం వల్ల ప్రాణాపాయం తప్పిందన్నారు.

"నీది బీ నెగటివ్ బ్లడ్‌రా. ఆ గ్రూపు బ్లడ్ కోసం చాలా కష్టపడాల్సొచ్చింది. ఎవరో వాలంటీర్ నీ గ్రూపు రక్తం కావాలని నెట్లో పెడితే నలుగురు ముందుకొచ్చి రక్తదానం చేశారు" అన్నారు నాన్న.

"ఆ ముక్కూ మొఖం తెలీని వాళ్ళు చేసింది నిజానికి ప్రాణదానమేరా" అంది అమ్మ.

కళ్ళు మూసుకున్నాను.

మృత్యుశకటం కళ్ళముందు కదుల్తోంది. అప్పుడు నేను చేసిన ఆర్తనాదం నా చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది.

వెంట్రుకవాసిలో తప్పించుకున్నాను. లేకపోతే.......!

ఆపైన ఊహించడానికి నాలో శక్తి అనే పదార్థం లేకుండా పోయింది.

"జరిగిందాని గురించి ఆలోచించకు. పైన దేవుడున్నాడు. నీ ద్వారా ఏదో సాధించాలనే నిన్ను రక్షించాడు. మంచివాళ్ళని కంటికి రెప్పలా కాపాడతాడు......"

నా మన:స్థితి గ్రహించినట్టుగా అంది అమ్మ.

నిజమా? నేనేమైనా సాధించగలనా? సాధిస్తే అది నా గురించే అవుతుంది. నా స్వార్థం మీద దేవుడికి ఆసక్తి ఎందుకుంటుంది?

కర్మ కాలి చనిపోయివుంటే ఏమయ్యేది? కంపెనీలో ఓ ఉద్యోగి తగ్గేవాడు. అమ్మా నాన్నా కుమిలిపోయే వారు. అంతేనా? ఇంకెవరికీ ఏమీ కానా? ఏమీ కాదా? నేననే వాడ్ని లేకపోయినా ఈ ప్రపంచం మీద ఎలాటి ప్రభావం వుండదా? ఎప్పట్లాగే వుంటుందా? కనీసం నన్ను గుర్తు చేసుకునే వారు ఒక్కరు – ఒకే ఒక్కరైనా వుండరా?!

అంతులేని అంత: సంఘర్షణ! మెదడు నిండా అలుముకుంటున్న అశాంతి!

పదిరోజుల తర్వాత డిశ్చార్జ్ చేశారు. కారులో ఇంటికెళ్తూంటే దేవాలయం దగ్గర కారు ఆపించి లోపలికి తీసుకెళ్ళింది అమ్మ. చేతులు జోడించి మనస్ఫూర్తిగా దేవుడికి కృతజ్ఞతలు తెలియజేసి వస్తోంటే ఓ ప్రక్కన ఏదో ఉపన్యాసమిస్తూ కన్పించారు నారాయణా నంద.

నన్ను చూస్తూనే దూడకోసం పరుగు పరుగున వచ్చే గోమాతలా నాకెదురు వచ్చారు. "రా నాయనా....." అంటూ ఆప్యాయంగా నా భుజం మీద చేయి వేసి మరీ తీసుకెళ్ళారు. నేను క్షేమంగా ఉన్నందుకు కాబోలు ఆయన కళ్ళల్లో ఆనందం తొణికిసలాడుతోంది.

మిగతా భక్తుల్తో బాటు ఆయనకెదురుగా కూర్చున్నాను. అమ్మ కూడా వచ్చి జత కలిసింది.

నారాయణానంద తమ ఉపన్యాసం కొనసాగించారు.

"జీవితాన్ని ఒన్ డైమెన్షన్లో గాక త్రీ డైమెన్షన్లలో చూడాలి. మూడు మార్గాల ద్వారా ఉన్నతీకరించుకోవాలి. వ్యక్తిగత లక్ష్యం, సామాజిక లక్ష్యం, వృత్తిపర లక్ష్యం ఏర్పరచుకోవాలి. ఏ ఒక్కదానికో పరిమితమై పోకుండా ఆ మూడింటినీ సాధించడానికి కృషి చేయాలి. అప్పుడే మనిషి పరిపూర్ణుడవుతాడు. ఉత్కృష్టమైన మానవజన్మ సార్థకం చేసుకోగలుగుతాడు.

మొదటి లక్ష్యం తన గురించీ తనని కన్న వాళ్ళ గురించీ తను కన్న వాళ్ళ గురించీ బంధు మిత్రుల గురించిన బరువులూ బాధ్యతలూ అనుబంధాలూ అభిమానాలకూ

సంబంధించింది. రెండోది సమాజం గురించిన బాధ్యత. దాన్నే మనుష్య ఋణం అంటాం. కన్ను తెరిచింది లగాయితు కన్నుమూసేవరకూ అడుగడుగునా మనకెందరో సాయసంపదలందిస్తున్నారు. సుఖంగా బ్రతకడానికి మార్గం సుగమంచేస్తున్నారు. వారి ఋణమన్నమాట. మూడోది ఉపాధి మార్గం లేదా బతుకుతెరువు గురించినది. కొందరు కెరీరే జీవితం అన్న భ్రమలో పడి కొట్టుకుపోతుంటారు. వారికి తమ స్థాయీ స్వార్థమూ తప్ప సమాజ స్థితిగతులు పట్టవు. తోటి వారి గోడు విన్పించదు. ఇతరుల కన్నీళ్ళు కన్పించవు. తమకి అవసరమైతే తప్ప ఇతరుల్ని కన్నెత్తి చూడరు...."

తుళ్ళి పడ్డాను. స్వామీజీ నా గురించే చెబుతున్నట్టన్పించింది. మరింత అప్రమత్తుడ్నై ఆలకించసాగాను.

"ఒక చిన్న ఉదాహరణ చెబుతాను. రోడ్డు మీద వెళ్తోంటే ఒకరికి ప్రమాదం జరిగిందను కోండి. ఎవరో ఒకరు ఫోన్ చేస్తేనే అంబులెన్స్ వస్తుంది. అంబులెన్సులోని డాక్టరో అటెండెంటో ప్రాథమిక చికిత్స చెయ్యాలి. చెయ్యకపోతే పరిస్థితి వికటించే ప్రమాదముంది. అలాగే అంబులెన్స్ డ్రైవరు కూడా వేగంగా చాకచక్యంగా నడిపితేనే సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్ళగలుగుతాడు. సమయానికి డాక్టరు, నర్సు సరైన వైద్యసాయమందిస్తేనే ప్రాణాపాయస్థితి నుండి బయటపడతాడు. ఒకవేళ రక్తం అవసరమైతే రక్తదాతలు అవసరమూ పడుతుంది. చూశారా, ఒకరి ప్రాణం రక్షింపబడాలంటే ఎందరు ఎన్నిరకాల సాయమందించాల్సి వచ్చిందో. ఇదే కాదు మన ఆహారం ఇళ్ళు దుస్తులు చదువులు వాహనాలు వినోదాలు వైద్యం మందులు మాకులు ఇలా ఎన్నో మనకు సమకూరుస్తోంది తోటి మానవులే. వారి శ్రమఋణం తీర్చుకోవాలంటే తోటివారి కన్నీరు తుడిచి చేయూతనివ్వాల్సిందే. 'నేను', 'నా' వదలి 'మన' భావం పెంపొదించుకోవాల్సిందే. మానవ సేవే మాధవ సేవ అన్నదిందుకే. అలా పదుగురి కోసం బ్రతికినప్పుడే మానవజన్మ సార్థకమవుతుంది...."

నా మార్గం నా గమ్యం స్పష్టమైంది. మరి కూర్చోలేకపోయాను. చటుక్కున లేచి వెళ్ళి నారాయణానందకి పాదాభివందనం చేశాను.

(రంజని 'బహుమతి కథ-2' డిసెంబరు 2013)